# తెలుగు వాణి

## శ్రీ పార్థివ నామ సంవత్సరాది ప్రత్యేక సంచిక

సంపాదకుడు
*రామ్ డొక్కా*

ముఖచిత్రం – *మూర్తి మంథా*
ఇతర చిత్రాలు – *భవాని వేదుల, నేహా ఆత్యం*
ముగ్గులు – *రమ్య బలిజేపల్లి*
సేకరణ– *రాయుడు వృద్ధుల, పద్మజ మదీన*
కూర్పు–*రామ్*





ఏప్రిల్, 2005 **Vol.15 No.1**

## ఆస్టిన్ తెలుగు సాంస్కృతిక సంఘం

**Be a proud member of TCA, participate in its activities and encourage others to join TCA !!**

# ఆస్టిన్ తెలుగు సాంస్కృతిక సంఘం – 2005 కార్యవర్గం

-

**అధ్యక్షుడు**
*చారి తమిరిస*

**కార్యదర్శి**
*నళిని రావు*

**కోశాధికారి**
*రవి పోతుకూచి*

**కార్యవర్గం**
*పద్మజ మేదీన*
*నందిని చింతల*
*ఉమారాణి పింగళి*
*రాయుడు వృద్ధుల*
*కృష్ణ కానుకుర్తి*
*రామ్ డొక్కా*

**తెలుగుబడి నిర్వహణ**
*సత్యం మందపాటి*

**మెంబర్ డేటాబేస్**
*విక్రాంత్ రుత్తల*

**తెలుగువాణి సంపాదకుడు**
*రామ్ డొక్కా*


**TELUGU CULTURAL ASSOCIATION**
**P.O. Box #142241**
**Austin, TX 78714-2241**

**e-mail: teluguvani@austintelugu.org**
**Online: http://www.austintelugu.org**

# మన(సు)లో మాట..

-

అటు కాల గమనంలో మరో సంవత్సరం దొర్లిపోయింది, గతాన్ని ఒక జ్ఞాపకంగా మిగిల్చి వెళ్ళిపోయింది. ఇటు నూతనోత్సాహంతో క్రొత్త సంవత్సరం అడుగిడుతోంది, నవ చైతన్యానికి నాందీ వాచకం పలుకుతోంది. ఎవరో కవి చెప్పినట్లు, మనకున్నవి గతము, భవిష్యత్తు, ఈ రెండే. ఎందుకంటే వర్తమానం, ఊహల భవిష్యత్తు దిగి, తన పెట్టె సర్దుకొనేలోపలే గతించి, గతమై కూర్చుంటుంది. ఈ భూత భవిష్యత్సంధ్యల మధ్యన ఊగిసలాడే మానవ జీవితం లిప్త పాటు, అంతలోనే ఈ అంతరంగానికెందుకో ఆలోచనల తత్తరపాటు?

ఈ ఆలోచనలు అజరామరం కావాలంటే ఏం చేయాలి? అని అప్పుడప్పుడు, మనమందరమూ కొద్దో గొప్పో ఆలోచిస్తూనే ఉంటాము. వాటికి ఆచరణ రూపమివ్వడమే సబబని విజ్ఞులందరూ అంగీకరిస్తారు కానీ, క్షణకాలం నిలవని ఆలోచనలను ఆచరణలో పెట్టడమెలా? అది సామాన్యులకు సాధ్యమయే పనేనా? ఆచరణకు ముందుగా వాటికి అక్షరరూపమిచ్చే ప్రయత్నం చేయడం మేలని నా అభిప్రాయం. మస్తిష్కంలో అనునిత్యం కదను త్రొక్కే ఆలోచనాశ్వాలకి అక్షరాల కళ్ళేలు వేసి, సాహితీ వనాల వెంబడి పరుగెత్తింప జేస్తే మనం చేరగలిగే ఆత్మసంతృప్తి గమ్యాలు, పదిమందికీ పంచ గలిగే విజ్ఞాన వికాస పుష్పాలు అనంతం.

ఆ ఉద్దేశ్యంతోనే, ఈ పార్థివ నామ సంవత్సరాది సందర్భంగా, మన మంచి కబుర్లతో, తెలుగు వాణి ప్రత్యేక సంచికను ప్రచురించాలని సంకల్పించినదే తడవుగా, ఎందరో ఔత్సాహిక రచయితలూ, రచయిత్రులూ తమ తమ ఆలోచనామృతాన్ని పదిమందితో పంచుకోవడానికి ముందుకొచ్చారు. వారంతా భావపుష్టిని ప్రసాదిస్తే, మరెందరో సహృదయులైన ప్రకటన కర్తలు కావలసిన అర్థ పరిపుష్టిని కలిగించారు. వారందరి కృషి ఫలితమే నేడు మీ చేతుల్లో ఉన్న ఈ ప్రత్యేక సంచిక. దీనిని మీకు నచ్చిన సంగతులతో, ఆలోచింప జేసే విషయాలతో తీర్చిదిద్దే ప్రయత్నం చేశాను.

ముందుగా "సాహితీ సరోజాలు" అనే భాగంలో, సాహితీ వనంలో విరిసిన మంచి పుష్పాలనేరి కోరి దండగా కూర్చడం జరిగింది. ఇక ప్రకటన కర్తలు మీతో పంచుకొన్నవీ, తెలుగు వాణి తరపున వారికి మేమందించేవీ "అభినందన మందారాలు". చివరగా, చలాకీ మాటల తూటాలతో, చురుకైన చమత్కారాలతో, వాడిగా, వేడిగా, సూటిగా, ఘాటుగా, గిలిగింతలు పెట్టి, చిలిపి ఊహలు తెప్పించి, నవ్వించి, కవ్వించే రచనలన్నిటినీ రాశులుగా పోసి, ఘుమ ఘుమల "సరదా జరదాలు"గా పేర్చి కిళ్ళీలు కట్టడం జరిగింది, సేవించి ఆనందించడం మీ వంతు.

మీరు ఒకసారి చదివితే, మీ చేత మళ్ళీ మళ్ళీ చదివింప జేసి తీరాలనే తాపత్రయమే నన్నీ సాహసానికి పురి కొల్పింది. ఇందులో ఎంత కృతకృత్యుడనయ్యానో చెప్పడానికి మీరే న్యాయ నిర్ణేతలు. మీరు ఇందలి విశేష రచనలన్నిటినీ చదివి ఆనందించి, మీ ఆలోచనలను కూడా అక్షర రూపంలో పెడతారని, వచ్చే తెలుగు వాణి సంచికల కోసం తప్పక సిద్ధం చేసి పంపుతారనీ ఆశిస్తున్నాను. *అందరికీ **శ్రీ పార్థివ నామ సంవత్సరాది** సందర్భంగా **శుభాకాంక్షలు** తెలియ జేస్తూ..*

మీ

రామ్ డొక్కా

# Message from the 2005 TCA Chairperson

-

**- Chary Tamirisa**

Dear TCA Members,

The TCA Executive board joins me in wishing all TCA members and the community at large, a very happy *Ugadi*. The Telugu *Ugadi* or New Year was on April 9th, 2005 and the name of this year is *Sri Paarthiva*.

I wish to thank you for electing the current TCA Executive board members. It is indeed a privilege to be part of the TCA Executive board.

With your active support and participation, we plan to organize a variety of cultural programs and community services. We would like to continue to support visiting artists from India by helping with their presentations in Austin. We would like to create more opportunities for participation from our youth and young adults.

We plan to revitalize the *Swara Madhuri* (group songs) and the *Kala Pradarshini* (drama). We will invite other non-profit organizations to participate in our programs and work with other Indian Organizations (ICC, etc.) to enhance inter-community camaraderie.

These are ambitious goals. However, with your participation, we can make them a reality.

Again, thanks for giving us the opportunity to serve the Telugu Community of Austin.

Sincerely,

Chary Tamirisa

Chairperson

TCA 2005

## లోపలి పేజీల్లో..

### 1. సాహితీ సరోజాలు


1) శ్రీ పార్థివ నామ సంవత్సరమునకు స్వాగతము -- 9
   - *సూర్య చింతామణి శాస్త్రి సవితాల*

2) ఉగాది శుభాశంసన -- 10
   - *శ్రీనివాసాచార్యులు మహేంద్రాడ*

3) మధుర గానం -- 11
   - *లక్ష్మి పుచ్చా*

4) ఉదయం -- 11
   - *రమణి విష్ణుభొట్ల*

5) వ్యవహారం -- 11
   - *శ్రీనాథ్ నాంపల్లి*

6) ఒక్క ప్రాణము, అంతే.. -- 12
   - *కృష్ణ మోహన రావు జెజ్జాల*

7) గానకళాప్రపూర్ణ ఘంటసాల -- 13
   - *రామప్రసాదరావు కేసానపల్లి*

8) తత్త్వమసి -- 15
   - *ఉదయ భాస్కర్ నందివాడ*

9) నా నుడి -- 20
   - *లత గొబ్బూరు*

10) పలివెల శ్రీ ఉమా కొప్పు లింగేశ్వర స్వామి క్షేత్ర గాథ -- 21
   - *లత గొబ్బూరు, పూర్ణ బలిజేపల్లి*

11) "పద్య" కవితా పితామహుడు – అన్నమయ్య -- 23
   - *రామ్ డొక్కా*

12) Comparitive Book Review – The diaries of Anne Frank and To Kill a Mockingbird
   - *Vamsi Vishnubhotla* -- 28

13) India as a Literary Area - Unsolved Problems in Literary Trends -- 29
   - *Radha Krishna Budaraju, J of Institute of Asian Studies*

## లోపలి పేజీల్లో..

2. అభినందన మందారాలు

| |
|---|
| Taj Grocers |
| Swagat |
| Sarovar |
| Lexus |
| Paul Bordovski |
| Amelia Lopez |
| Art Novaro |
| Jay Gohill |
| Madras Pavilion |
| Gandhi Bazaar |
| Non Profit AHTCC |
| Frank Lam Associates |
| Dr. Sridhar Reddy |
| David Armbrust |
| Minerva |
| Non Profit AID |
| Dr. Lakireddy |
| Digi Optix |
| Non Profit Vibha |
| All State |
| Inforide |
| Sulekha |
| Vinod Reddy |
| Dr. Sam Narra |
| Non Profit Saheli |
| Brown McCarroll |
| Sky Pass |

## 3. సరదా జరదాలు

-

14) మన మల్లిక్‌తో మాటా మంతీ - మాట-ఫణి, మంతి-బాల ఇందుర్తి -- 32
- *శ్రీనివాస ఫణికుమార్ డొక్కా*

15) ది స్టోరీ -- 36
- *ఇర్షాద్ జేమ్స్*

16) బై బై తారణా! -- 37
- *వీరభద్ర శాస్త్రి కాలనాథభట్ట*

17) ఆవకాయోపాఖ్యానం -- 38
- *శ్రీనివాస ఫణికుమార్ డొక్కా*

18) విద్యార్థి -- 39
- *నేహ అత్యం*

19) *ఉగాది - అమెరి"కందాలు"* -- 40
- *రామ్ డొక్కా*

20) టు-లెట్ -- 42
- *శ్యామ్ సోమయాజుల*

21) పార్థివ ఉగాది దక్షిణ మారుతాలు -- 46
- *అందుకూరి శాస్త్రి*

22) బుచ్చిగాడు -- 47
- *హరి మద్దూరి*

23) చలో ఇండియా - స్నేహితుల అనుభవాలు, అభిప్రాయాలు -- 48
- *రామ్ డొక్కా*

24) తెలుగు పుస్తకాల ఉద్యానవనం -- 52
- **AVKF BookLink**

25) ముగ్గులు -- 53
- *రమ్య బలిజేపల్లి*

26) నీలోకి నువ్వు
- *సత్యం మందపాటి*

27) అవరోహణం - ఆరోహణం
- *సత్యం మందపాటి*

28) 9/11
- *రాయుడు వృద్ధుల*

29) అత్త గా(వా)రి సొమ్ము
- *వేంకటేశ్వర రావు వేమూరి*

30) ప్రవాసాంధ్ర సాంస్కృతిక రంగంలో సంచలనం - సిలికానాంధ్ర
- *కిరణ్ ప్రభ*

# సాహితీ సరోజాలు



# శ్రీ పార్థివ నామ సంవత్సరమునకు స్వాగతము

-

*- సూర్య చింతామణి శాస్త్రి సవితాల*



సీ. శ్రీ పద్మనాభుని లీలా వినోదమే
చతురాననుని జన్మ, జలములందు
భూ వృక్ష, మృగ పక్షి, భూధరాది చరాచ
రముల సృష్టి యొనర్చె బ్రహ్మ, యపుడు
విశ్వాంతరాళాన వివిధ గ్రహములను
తారకానివహాల తనర జేసె,
భూభువన నివాస బుద్ధ జీవులన్నియు
పరిసరముల మార్పు పరిగణించి

తే.గీ. పగలు రేల భేదము ఋతు భ్రమణమెరిగి
చెట్లు చిగురించి పూర్వపు చెలువ మంద
కనుగొని నవ వసంత యుగాది యనిరి
కాలగతిలోన మారి ఉగాది యయ్యె..

సీ. వేధించు చలి తగ్గ, వేడి నిమ్మనుచు, ఎ
వరు కోర సూర్యుడు చురుకు చూపె?
తరువులు మోడులై తాపసుల పగిది
నిలచి యడుగకయె ఫలములిచ్చె?
సుమ సుగంధములు కుసుమ మకరందమ్ము
లెవరడుగ తరువులిచ్చె? కనగ
కొమ్మల దాగిన కోకిలొక్కటియైన
తనుపు వారి తెలియ తరము కాదు

తే. గీ. అడుగకయె వలసినవెల్ల అమరి యుండ
ఋతువులావృతులై తొలి ఋతువు కనగ
సంపదలు సుఖాలు కలుగు సమయ మనుచు
ఆమని తొలి దినము వత్సరాది యనిరి

ఉ. నూతన వత్సరమ్మనుచు నూతన
వాంఛలనంతమై, నిజ
స్వాంతమునాక్రమించుకొనగ శాంతము
కోల్పడి నింద జేయగన్
పాతక మంచు తెల్పుదురు పావన
భూప్రవక్తకుల్ కడున్
చింతన సల్పి చిత్తమును చింతకు దూరము
సేయ మేలగున్.

కం. గతకాలపు మానవ జీ
వితపు నొడిదుడుకుల నారు విధములతెలుపన్
గతమును షడ్రుచులుగ దెలు
ప, తెలుగు వారికి ఉగాది పచ్చడియయ్యెన్.



తే.గీ. సకల విధముల సంపదలను శాంతి నిచ్చి
తారణ వెడలె కడు తనియ జేసి
నూతన పార్థివ నామ సంవత్సరమ్ము
వచ్చె, జనులు సిరుల వరల గలరు..

# ఉగాది శుభాశంసన

-

- శ్రీనివాసాచార్యులు మహేంద్రాడ
అర్చకులు, ఆస్టిన్ హిందూ మందిరం



నవ యుగానికి ఆరంభమే ఉగాది
నవ తరానికి ప్రతీకయే ఉగాది
చేదు తీపి పులుపుల మిళితమే ఉగాది
చరిత్రకు మార్పులు తెచ్చేది ఉగాది

క్రొంగొప్ప ఊహల, ఊసుల పల్లకియే ఉగాది
నూతన జీవనయానానికి నావయే ఉగాది
భవిష్యద్జీవన సౌధానికి పునాదియే ఉగాది
నూతన ఆశలు చిగురింపజేసే ఉషస్సే ఉగాది

ఈ ఉగాది,
నవతకు నాంది కావాలి,
శాంతి కుసుమాలు విరజల్లాలి,
విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించాలి..

అని,
నా అంతరంగంలో కాంక్షిస్తూ
ఆ సర్వేశ్వరుడు, ఈ సంవత్సరమంతా,
అందరికీ సకలైశ్వర్యాలూ, సర్వ శుభాలూ,
కలుగజేయాలని కోరుకొంటూ,

శ్రీ పార్థివ నామ సంవత్సరాదికిదే
నా (సు) స్వాగత కుసుమాంజలి..

## మధుర గానం

\- *లక్ష్మి పుచ్చా*



మధుర గానామృతము మలయమారుతమై
మదినూయలూగించి హాయిరగిలించు
మారుమూలల మ్రగ్గిన భావముల వెలిదెచ్చి
భాషలేని యూహల నుఱ్ఱూతలూగించు

పండితుల, పామరుల, పసిపాపలనె గాక
విషసర్ప వన్య వాసితుల గూడ
పరవశింప జేసి వాని స్వగుణములనెల్ల
మరపించి యలరించు ప్రతిభగలది

మర్మమెరుగని తీయనిపల్లెపదముల విన్న
మనసుతేలికై స్వేచ్ఛా వాయువులనేలు
భావగర్భితములగు భక్తి కీర్తనలు విన్న
మది నిర్మలమై మాలిన్యమెల్ల తొలగు

విరియ బూచినట్టి భావామృత గానము
విశ్వమెల్ల వ్యాపించి దిశలజొచ్చి
తన్మయత్వములోన తనువునే మరపించి
తాదాత్మ్యము కల్గించు శక్తి కలది

మృదు మధురగానము చెవిసోకి నంతనె
పరవశింప జేసి యునికినే మరపించు
అట్టి తీయని కంఠము తమదైన వారెల్ల
గాన కళాదేవికే గారాబు బిడ్డలు

## ఉదయం

\- *రమణి విష్ణుభొట్ల*

అరుదెంచె సూరీడు దివియంత తానై
మురిసింది ఈ పుడమి మగతగా చూస్తూ

నునుసిగ్గు దొంతరల తెలిమంచు చాటుగా
సుమబాల తొలిసారి లోకాల్ని చూడ
ఆ లేత చెక్కిళ్ళ తుహినాంబు కళికలో
తనవాడి కిరణాలు హరివిల్లుగా అమర

నీలాల రేవులో నడిలోతు నీళ్ళలో
వెంట తెచ్చిన బిందె తళతళా మెరియ
వంటినంటిన చీర వయ్యారమొలికించ
వనిత సొంపుల మేను బంగారమై అరయ

గృహసీమ తనపాలి స్వర్గమ్ము కాగ
మదిలోని సంతృప్తి మోమంత ప్రాక
భగవంతు ధ్యానించు ఇల్లాలి నుదుట
తన ఉదయ కిరణాలు సౌభాగ్యమై అరయ

## వ్యవహారం

\- *శ్రీనాథ్ నాంపల్లి*

తను చేసిన మట్టి బొమ్మకి
మహిమ కలదని
మనిషి చేసెను నమస్కారం

బ్రహ్మ చేసిన సాటి మనిషికి
స్వార్థం వదలక
తలచి చేయడు సహకారం

ఇదెక్కడి లోక వ్యవహారం??

# ఒక్క ప్రాణము, అంతే. .

– *కృష్ణ మోహన రావు జెజ్జాల*

హాయిగా విహంగములా
విహాయస వీథిలో
విమానాలలో తేలుతూ
మొట్టమొదట విహరించింది
ఎవ్వరో కాదు– మేమే

విమానాలనుండి
వేలాది మారణాస్త్రాలను
నగరాలపై నాగరికులపై
ప్రయోగించింది ఎవరో

అహోరాత్రాలు పరిశ్రమించి
అణువులోని రహస్యాలను
అవలీలగా పరిశీలించి
శాంతి కొరకు అణువులు
అని చాటింది– మేమే

రెండు మహానగరాలపై
అగ్ని వర్షాలను కురిపించి
క్షణములో స్మశానాన్ని
సృష్టించింది ఎవరో

స్వాతంత్ర్యము కొరకు
జీవితాన్ని జీవాన్ని
పరిత్యజించుటకు
తడబడక నిలిచిన
త్యాగమూర్తులము మేమే

స్వాతంత్ర్యము పేర
భీబత్సాన్ని భయానకాన్ని
నాట్యమాడించిన
శౌర్యవంతులు ఎవరో

వాయువేగ మనోవేగాలతో
నడయాడే యంత్రాలను
నౌకలను జలాంతర్గాములను
నిర్మించి ముందడుగు పెట్టింది
మరెవ్వరో కాదు– మేమే

వ్యోమాన్ని కలుషితము చేసి
సాగరాలను నిర్జీవము చేసి
వాతావరణంలో మార్పు తెప్పించిన
వైజ్ఞానికులు ఎవరో

ఒక వ్యక్తి ప్రాణముకొరకు
పుట్టబోయే పసిపాప కొరకు
ఎంత కష్టాలైనా సరే
ఎదుర్కొనే పట్టుదల గలవారు
వేరెవ్వరోకాదు– మేమే

పుట్టిన పసివాళ్ళను
మందు కొనలేని రోగులను
పాలకొరకు పరితపించే తల్లులను
పట్టించుకోనిది ఎవరో

ప్రగతికి వారసులం
ఔన్నత్యానికి నిర్మాతలం
ఆనందానికి నాందివాక్కులం
ఆర్థికసంపదకు అర్థం ఎవ్వరో కాదు– మేమే

యుద్ధానికి ఉత్సాహవంతులు
పతనానికి బానిసలు
వేదనకు గీతికలు
దరిద్రనారాయణులు ఎవరో

మాకు కావలసింది
వంద ప్రాణాలు కావు
వేల ప్రాణాలు కావు
లక్ష ప్రాణాలు కావు
ఒక్క ప్రాణము, అంతే. .

# గానకళాప్రపూర్ణ ఘంటసాల

(1922-1974)

*- రామప్రసాదరావు కేసానపల్లి*

"శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం" అంటూ శృతిపేయంగా హంసధ్వని రాగంలో హాయిగా, తీయగా సాగే గజాననుని ధ్యాన శ్లోకం విన్నా, కామవర్ధిని రాగంలో, కమ్మగా వీనులవిందుగా, పసందుగా ప్రతిధ్వనించే "పార్థాయ ప్రతిబోధితాం, భగవతా నారాయణేన స్వయం" అనే గీత ఉపోద్ఘాత ధ్యాన శ్లోకం ఆలకించినా, సంగీత ప్రియుల మనోగతంలో తళుక్కున మెదిలేది, కదిలేది, దివంగత దివ్య భవ్య ఘంటసాల వేంకటేశ్వరరావు గురువర్యుల రూపం, ఆయనకు సంబంధించిన సంగీత భరిత తీపి జ్ఞాపకాలు.

ఆ అమరగాయకుని తలచుకొంటేనే చాలు, శరీరమాపాదమస్తకం పులకించి ఆ మహాగాయకునికి నీరాజనాలు సమర్పించాలనిపిస్తుంది. ఆ సుమధుర గాయకుని గురించి నాకు తెలిసిన కొన్ని ముఖ్యమైన విశేషాలు, విషయాలు వివరించి నా ఆనందం మీతో పంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాను.

నా జన్మ సుకృతమేమోగాని, నేను పుట్టిన విజయనగరంలోనే ఘంటసాల గారు మహారాజా సంగీత కళాశాలలో సంగీతాధ్యయనం చేయటం, ఇక్కడే తొలుదొల్త సంగీత కచేరీలు చేసి, శాస్త్రీయ సంగీత కళాకారునిగా గుర్తింపు పొందడం సంభవించేయి. ఒక మహాగాయకుని తీర్చిదిద్ది, సంగీత ప్రపంచానికి, యావదాంధ్రజాతికి సంతసం చేకూర్చిన ఘనత, మాననీయత విజయనగరానికి దక్కింది. ఘంటసాల గారు సాయం సమయంలో ఏకాంతంగా కొండలమీద కూర్చొని సంగీత సాధన చేసినట్టి "బాబా మెట్లు" అనే ప్రాంతంలో, వారిని స్మరించుకొంటూ, నా విద్యార్థి దశలో, నేను, నా స్నేహితులు కొందరు వారు గానం చేసిన పాటలు, పద్యాలు పాడుకొని తన్మయులయ్యే వాళ్ళం. ఆ మధురస్మృతులు అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ మరువలేనివి, మరపురానివి.

ఘంటసాల గారి జీవితం యావత్తూ సంగీతభరితం. చౌటపల్లి అనే కుగ్రామంలో డిసెంబరు 4, 1922 లో జన్మించిన ఈ బాలగంధర్వుడు తదుపరికాలంలో నేపథ్య గాయకునిగా, సంగీత ప్రయోక్తగా, తెలుగు సినిమా రంగాన్ని శాసించి, సినీ సంగీతాన్ని సుసంపన్నం చేసి, విలక్షణమైన సంగీతబాణీలకు రూపకల్పన చేసి, తనదైన ప్రత్యేక సంగీతముద్రను వేశారు. వారికి పూర్వులైన ప్రముఖ సినీనటులు, గాయకులైన కపిలవాయి రామనాథ శాస్త్రి గారు, పారుపల్లి సుబ్బారావు గారు, రెండు చింతల సత్యనారాయణ గార్లు పాడి, అలనాడు ప్రశస్తి గాంచిన పాటలకు, పద్యాలకు భిన్నంగా, తనదైన శైలిలో పాటలు, పద్యాలనాలపించడం మొదలుపెట్టి క్రొత్త ఒరవడి సృష్టించేరు ఘంటసాల గారు. పద్య గద్యాలు చదివినా, పాట పాడినా, హృద్యంగా, హృదయానికి హత్తుకొనేలా ఆకట్టుకొనేలా ఆలపించడంలో ఈ అపూర్వ గాయకునికి ఆయనే సాటి, వేరొకరు లేరు పోటీ. అయితే, ఘంటసాల గారి తొలినాళ్ళ సంగీత జీవితం కష్టాలు, కడగండ్లలోనే గడిచింది. ఆయనకు 11 సంవత్సరముల వయసులో తండ్రి గారైన సూరయ్య గారు పరమపదించడం, సంసారం గడవడమే కష్టతరమవడం, మొట్టమొదటి సంగీత కచేరిలు అభాసుపాలవడం ఇతరానేకానేక అవమానాలకు గురికావడం సంభవించాయి. ఈ ప్రతికూల సంఘటనలతో ఘంటసాల వారిలో ప్రముఖ గాయకుడనవ్వాలన్న ఆకాంక్ష ఊపందుకొంది. తత్ఫలితంగా చేతి వ్రేలికున్న ఉంగరాన్ని విక్రయించి, 1937 వ సంవత్సరములో, సంగీత కళాశాలలో ప్రవేశించడానికి విజయనగరము పయనమయ్యేరు ఘంటసాల గారు. సంగీత కళాశాలలో ప్రవేశమైతే లభించింది కాని, ఆయనకు దినదినం పొట్టగడవడం ప్రశ్నార్థకమైంది. మధుకర వృత్తి చేసుకొంటూ, నిరంతర గాత్ర సాధన చేస్తూండేవారు. అప్పట్లో మహారాజా సంగీత కళాశాలలో అధ్యాపకులైన సాలూరు చినగురువుగా ప్రసిద్ధులైన పట్రాయిని సీతారామ శాస్త్రి గారి శీతల సంగీత సన్నిధికి చేరిన ఘంటసాల గారి

జీవితం ధన్యమై, క్రొత్త మలుపు తిరిగింది. –నాదోపాసకుడైన ఘంటసాల గారి గాత్ర సంపద, సంగీతాభ్యాసనా జిజ్ఞాస, గురుభక్తి, శాస్త్రి గారికి, తన శిష్యునిపై అవ్యాజానురాగాలను కలిగించాయి. శాస్త్రి గారు తనకు తెలిసిన సమస్త సంగీత ధర్మాలు, మర్మాలు తన ప్రియ శిష్యునికి బోధించి, సుశిక్షితుని గావించేరు. ఘంటసాల గారికి గురువు గారంటే పంచ ప్రాణాలు.

సంగీతాభ్యాసం పూర్తి చేసి, కళాశాలనుండి, సంగీత విద్వాన్‌పట్టా పొందిన పిదప, విజయ నగరానికి వీడ్కోలు పలికే తరుణాంలో, ఏర్పాటు చేయబడిన కచేరీలో, ఘంటసాల వారి గాత్రమాధుర్యానికి, పరిణతకు పరవశించిన శ్రీమదజ్జాడాదిభట్ల నారాయణదాసు గారు, వర్ధమాన గాయకుడైన ఘంటసాలకు తమ తంబూరను బహూకరించేరు. సంగీతాభ్యాసం ఆ విధంగా పరిసమాప్తి చేసుకొని స్వగ్రామానికి తరలి వచ్చిన ఘంటసాల గారు, స్వయంగా సంగీత సాధన కొనసాగిస్తూ, సంగీత పాఠాలు చెబుతూ, అప్పుడప్పుడు చిన్న నాటకాలు వేస్తూ, జీవనయాత్ర సాగించేరు.

ఇదిలాగుండగా, 1942 సంవత్సరంలో దేశవ్యాప్తంగా చేపట్టబడిన "క్విట్‌ఇండియా ఉద్యమం" ఘంటసాల గారిని ఎంతో ప్రభావితం చేసి, ఆయనలోని దేశభక్తిని ఇనుమడింప జేసింది. తత్కారణంగా అనేకమైన దేశభక్తి గీతాలను ప్రబోధాత్మకంగా ఆలపించి, ఉద్వేగపూరితులైన స్వరంతో దేశ ప్రజలను ఉత్తేజపరచేరు. తత్ఫలితంగా బ్రిటిష్‌పాలకులాయనను నిర్బంధించి 18 మాసముల కారాగార శిక్ష విధించేరు. తదనంతరం ఆయనకు సావిత్రీ దేవి గారితో వివాహమయ్యింది. ఈ వివాహ ధర్మమేమో గాని, ఘంటసాలగారికి కొంతమంది ప్రముఖులైన పలుకుబడిగల వ్యక్తులతో పరిచయాలు, పలకరింపులు పెరిగేయి. అటువంటివారిలో ముఖ్యులు, అలనాటి సినీ గేయ రచయిత శ్రీ సముద్రాల రాఘవాచార్యులవారు. ఆయన అనునయం, ఆదేశాల మేరకు, సినీ నేపథ్యగాయకునిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి మద్రాసుకు మకాం మార్చేరు ఘంటసాల వారు.కాని ప్రారంభదశలో తానెంచుకొన్న దిశలో, గాన విశారదునికి ప్రథమ కష్టాలు, బాలారిష్టాలు, ఎదురుదెబ్బలు, చులకన చూపులు తప్ప లేదు. అస్సలు ఆయన కంఠం దూరశ్రవణ యంత్రానికి, రికార్డింగునకు పనికిరాదని, సరిపడదని, నిర్ధారించి వేశారు ఒక ప్రముఖ గ్రామఫోను కంపెనీ వారు.

అటువంటి తిరస్కారంలో, తిరోగమన తరుణంలో, మద్రాసు ఆకాశవాణి కేంద్రం వారు, ఆయన గాత్ర సౌలభ్యాన్నీ, పాండిత్యాన్నీ ఆదరించి, వారి కేంద్రం ద్వారా శాస్త్రీయ, లలిత గీతాలను పాడడానికి అవకాశం కల్పించేరు. ఈ సదుపాయం కలిగించడానికి ముఖ్య కారకులు శ్రీ బాలాంత్రపు రజనీకాంత రావుగారు. ఈ విధంగా ఘంటసాల గారు గాయకునిగా అనేకమంది సంగీత ప్రియుల దృష్టికి రావడం ప్రారంభమయ్యింది. ఘంటసాల గారు ఈ విధంగా పదిమందికి గానామృతాన్ని పంచుతూ, గాయకునిగా ప్రజాదరణ పొందుతున్న తరుణంలో, మొదటిలో ఆయన లోని ప్రతిభని గుర్తించని గ్రామఫోను కంపెనీ వారే ఆయనను ప్రాధేయ పడి, ఆయన చేత పాడించుకొని, అనేక గ్రామఫోను రికార్డులను ముద్రించి, అమ్మకాలు చేసి లాభాలను ఆర్జించేరు "నవ్విన వూళ్ళే పట్నాలయ్యేయన్నా.." అన్న నానుడిని నిజం చేస్తూ. ఆయన ఆలపించిన గీతాలు మందార మకరందాలు అని వేనోళ్ళ పొగడబడి, వారి కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేసేయి.

1945 వ సంవత్సరములో నిర్మించబడిన "స్వర్గ సీమ" చలన చిత్రంతో ఘంటసాల గారి సినీ జీవితానికి దశ తిరిగింది. కంఠంలో నూతనత్వం, భాషా పటుత్వం, ఉచ్ఛారణలో జవసత్వాలు సంతరించుకొన్న సినీ నేపథ్య గాయకునిగా ఆయన నిలద్రొక్కుకోవడం ప్రారంభమయ్యింది. తదాదిగా నిత్య నిరంతర నూతనాన్వేషి అయిన ఘంటసాల వారు సినీ నేపథ్య గాయకునిగా, సంగీత ప్రయోక్తగానే సరిపెట్టుకోక, వివిధ రకములైన లలిత, శాస్త్రీయ, జానపద గీతాలకు చక్కని బాణీలను కట్టి, పాడి, రికార్డుల రూపంలో మనకందించి, మనందరికీ నేటికి కూడా విని ఆనందించే భాగ్యం కలిగించారు. వివిధ రికార్డులలో నిండి, నిబిడీకృతమైన వారి గాత్ర మాధుర్యం "న భూతో న భవిష్యతి" అంటే అతిశయోక్తి కానే కాదు. ఆయన ఆలపించిన ప్రతి పద్యం, ప్రతి పాటా భావగర్భితంగా, నవరస స్ఫోరకంగా, గుండె

లోతులలోనుండి జాలువారే వేదన, ఆవేదనా -ప్రతిబింబించేలా, పది కాలాలు పలువురి గుండెల్లో ప్రతిధ్వనించేలా భాసిల్లడం నిర్వివాదాంశం.

ఆయన నలుగురికీ తెలిసిన రాగాలలో స్వర పరచి పాడిన పాటలు, పద్యాలు అసమానమైన మధురిమ, మృదుత్వం, లాలిత్యం పొదగబడి, పండిత పామర జన రంజకాలయ్యేయి. పద్యం పాడడంలో ప్రముఖంగా తనదైన ప్రత్యేకమైన బాణీని, శ్రేణిని సమకూర్చిన స్రష్ట ఘంటసాల. పాడిన ప్రతి పాటలోనూ వారి భావోద్వేగం కట్టలు త్రెంచుకొని ప్రవహిస్తూ ఉంటుంది. ఆయన ఎన్నో వైరుధ్యమైన పాటలు, పద్యాలు పాడారు. వీటిలో భావగీతాలు, శృంగార గీతాలు, జానపద గీతాలు, హాస్య గీతాలు, భక్తి గీతాలు, దేశభక్తి గీతాలు, వేదనా భరిత గీతాలు, వేదాంత గీతాలు, యుగళగీతాలు.. ఇంకా ఎన్నో, ఎన్నెన్నో. ఈ గీతాలన్నిటిలో జాలువారే ఘంటసాల వారు ప్రదర్శించిన భావ మాధుర్యం, పద లాలిత్యం, సరస సాహిత్య స్వర సమ్మేళనమే శ్రోతలను నాటికీ, నేటికీ మంత్ర ముగ్ధులని చేస్తుంది. తెలుగు జాతి అదృష్టమేమో గానీ, ఈ గంధర్వ గాయకుని జీవిత కాలం లోనే, ఘనతకెక్కిన సాంఘిక, జానపద, పౌరాణిక, హాస్య చిత్రాలు నిర్మించబడడం, వాటిలో ఘంటసాల గారు నేపథ్య గానం చేయడం, చాలా చిత్రాలకు తామే స్వీయ సంగీత దర్శకత్వ బాధ్యతను చేపట్టడం జరిగి, ఆయా చిత్రాలను మరపురాని సంగీత కళాఖండాలుగా మలచడం జరిగింది.

ఘంటసాల గారు స్వయంగా ప్రథమ శ్రేణి గాయకుడు, సంగీత దర్శకుడు అయినప్పటికీ, ఇతర సంగీత దర్శకుల సారథ్యంలో పాడినప్పుడు, శిష్యుడై, వారి ఆదేశాలమేరకు పాడేవారట. ఆయన నిగర్వి గనుకనే ఇట్టిది సాధ్యం. ప్రముఖ సినీ సంగీత దర్శకులైన స్వర్గీయ పెండ్యాల నాగేశ్వర రావు గారికి ఘంటసాల గారి వ్యక్తిత్వమన్నా, సంగీతమన్నా, ప్రియాతిప్రియం. పెండ్యాల గారు పేర్కొన్నట్లు, ఘంటసాల గారి గాత్రం మంద్ర, మధ్యమ, తార అనబడే మూడు స్థాయిలలోనూ సునాయాసంగా, సునాదభరితంగా పలుకుతుంది. ఇది అపురూపమైన, భగవద్దత్తమైన కానుక అని వారి అభిప్రాయం. ఈ విషయంలో వీరితో ఏకీభవించని సంగీత ప్రియులుండరని నా విశ్వాసం.

మన దురదృష్టమేమో గానీ, ఈ అమర, మధుర, మనోజ్ఞ గాయక శిఖామణి జీవితకాలం 52 సంవత్సరాలు మాత్రమే. తన 28 సంవత్సరముల సినీ సంగీత జైత్ర యాత్రలో ఘంటసాల గారు తెలుగు, తమిళ, కన్నడ, సింహళ భాషలలో 9000 పై చిలుకు పాటలు పాడేరు. 103 చలన చిత్రాలకు సంగీత సారథ్యం వహించేరు. వారిచే ఆలపించబడిన పుష్ప విలాపం, కుంతీకుమారి, అద్వైత మూర్తి, సాంధ్యశ్రీ, ఆంధ్ర జాతి పద్యములు విని, ఆనందించి పరవశించని తెలుగు వారుండరని అనుకొంటాను. ఈ గాన కళాప్రపూర్ణునికి వాటంతటవే వచ్చిన సన్మానాలూ, సత్కారాలూ కోకొల్లలు. భారత దేశ ప్రభుత్వము వారు 1970 వ సంవత్సరములో పద్మశ్రీ బిరుదును ప్రదానం చేశారు. 1971 వ సంవత్సరములో ఘంటసాల వారు న్యూ యార్కు తెలుగు సాహిత్య సాంస్కృతిక సంఘం వారి ఆహ్వానం మేరకు, తమ బృందంతో అమెరికాకు విచ్చేసి, తన గాన మాధుర్యంతో ప్రవాసాంధ్ర హృదయాలను పరిమళింప జేశారు. ఈ గంధర్వ గాయకుడు ఇహలోకంలో జీవించింది అతి తక్కువ కాలమైనా తన అరుదైన గాత్ర మాధుర్యంతో అశేష ఆంధ్ర, ఆంధ్రేతర శ్రోతలను మైమరపించి, రసజ్ఞుల హృదయాంతరాళాలలో నాటికీ, నేటికీ అమరగాయకుడై శాశ్వతంగా నిలిచాడు. వారి పాటలు విని తన్మయత్వం చెందిన వేళల్లో ఆ దివి నుండి భువికి దిగిన తుంబుర–నారద స్వరూపమే మన ఘంటసాల అనిపిస్తూంటుంది.

ఘంటసాల జీవిత పరమావధిని పరిపూర్ణముగా ఎరిగిన వేదాంతి కాబట్టే, తన జీవన చరమాంకములో, అనారోగ్యంతో బాధ పడుతున్నా లెక్క చేయక, చరిత్రలో చిరస్థాయిగా నిలిచే "భగవద్గీత" పారాయణ చేసి ధన్యులైనారు. వారి భగవద్గీతాలాపం వింటూంటే, అంత క్లిష్టమైన శ్లోకాలను, ఇంత పండిత పామర సుబోధకంగా ఎలా గానం చేశారా అనిపిస్తుంది. నా మట్టుకు నాకు BhagavadgIta made easy by Ghantasala అని అనిపిస్తూ ఉంటుంది. ఆ అమర గాయకునికివే నా నమోవాకములు.

# తత్త్వమసి

- ఉదయ భాస్కర్ నందివాడ

శూన్యానికి గుచ్చుకుంటున్న గాజుకళ్ళ చూపుల్లోనూ
ఆసుపత్రి గవుల్లోంచి వేలాడుతున్న కట్టెముక్కల్లోనూ
జీవాన్ని చూడాలా, మరణాన్ని చూడాలా, లేక
చావు బతుకుల మధ్య యుద్ధాన్ని చూడాలా?
టెరీ షైవో, నన్ను క్షమించు
నా కళ్ళకివేవీ కనబడడంలేదు
నీ బతుకు యంత్రం
కొన్ని భయంకర కుతంత్రాలకి హేతువవడమే
కనబడుతోంది
విశ్వానికి అమిత్రుడు నిన్న ఆదివారప్పూట
ప్రపంచాన్ని నిద్రలేపి ప్రతిజ్ఞ చేశాడు
త్రిశంకుడికి చెల్లెలుగా నీకు పునర్జన్మ నిచ్చాడు
బతుకు టెరీ,
నీ గాజుకళ్ళ దీపాలు వెలిగించుకో
జీవించే హక్కు కలకాలం వర్ధిల్లేలా
నీ కడుపులోకి చొచ్చుకుపోతున్న
గాజు గొట్టాల జన్మ తరించేలా
ఎండిన నీ రెక్కలకి
బతుకు కంకణం కట్టుకో
అవున్లే,
బతుకుతానన్న క్రిస్టఫర్‌రీవ్ ని
బతకనివ్వని సమాజంలో
బతకనన్న నిన్ను
బలవంతంగానైనా
బతికించడమే న్యాయం
జన్యు కణాల యే అసంకల్పిత కలయికలో
మొదలయ్యిందో
ఈ జీవం
అవయవాల చలన శక్తిగా,
ఆలోచనల జ్వలన శక్తిగా,
అయిన వాళ్ళ కంటి చెమ్మగా,
ఆత్మీయుల గుండె తీపిగా,
ఎప్పుడు రూపాంతరం చెందిందో
ఈ ప్రాణం
నీ ప్రాణన్నిలా నిరర్థకంగానైనా
కొనసాగనివ్వడమే ధర్మం
ఎన్ని కలలు వమ్మైనా
వచ్చే ఎన్నికలదాక
నిన్నలా ఆసుపత్రి మంచానికి
అతికించడమే సమాజానికి శ్రేయస్కరం

ఆకారం దాల్చకముందే
అవతారం మొదలయ్యిందని
ఒప్పుకుంటే
చలన శక్తి నశించినా
జీవాత్మ చావనట్లే కదా!
కనురెప్ప మూయ్యాలన్నా
లఘుశంక తీర్చాలన్నా
నీ చేతుల్లో లేకపోవచ్చు టెరీ,
కానీ,
ఆది పాపమూ నీదే
తుది పయనమూ నీదే
Last Judgement మాత్రం
వాడెవడో పరమాత్ముడు
చక్రమడ్డేసి మరీ
తీర్పు చెబుతానంటున్నాడు
నీకు తెలీదేమో కానీ,
జీవితమే కాదు, మరణమూ నీ చేతుల్లో లేదు
మరణించే హక్కుని వేడుకుంటున్న నువ్వు
జీవించే హక్కుకి ప్రతీకగా మారడంలో
ఉన్న ఐరనీ నీకు తెలియకపోవడమన్న
ఆకరి అదృష్టాన్ని గుదిబండగా చేసుకుని
నియంత్రణలో లేని నీ భుజాలమీద
జీవితాంతం మోస్తూ
సిసిఫస్‌లా
బతుకు టెరీ, బతుకు
బతుకు, బతుకు, బతుకు
చచ్చినట్లు బతుకు
చచ్చినా సరే, బతికే తీరు..

# నా నుడి

- లత గొబ్బూరు

మనం నిత్య జీవితంలో ఎన్నో సామెతలను, నానుడులను, పొడుపుకథలను, నీతి పద్యాలను, శాస్త్రాలను, శతకాలను, సరసపు చమత్కారాలను, విరసపు రుసరుసలను, చాటువులను, ఎన్నో పదాలను, వాక్యాలను మన మాటలలో అవలీలగా ప్రయోగించడం చూస్తూ, చేస్తూ ఉంటాము. కానీ ఆ మాటలవెనుక అసలు మర్మం, ఆ ప్రయోగాల వెనుక అర్థం, వాటి విలువ చాలామందికి తెలియదు. ఈ విధమైన భాషాప్రయోగాలకి చదువుకొన్నవారని, చదువులేనివారని మినహాయింపులు లేవు. ఇలా తెలిసీ తెలియని ప్రమాణాలతో వాడే భాషా ప్రయోగాలు ఈనాటివి కావు. నాగరికత అంతగా అభివృద్ధిచెందని, ప్రాచీన, పురాణాల కాలంలోనే ఎంతో శాస్త్రీయంగా ప్రతిదీ సులభతరంగా, గొప్ప ప్రమాణాలతో చిరకాలం మనిషికి ఉపయోగపడేలా తీర్చిదిద్దారు శాస్త్రకారులు. మనిషి అన్నవాడు ఎలా వుండాలి?, సభ్య సమాజంలో ఎలా మసలుకోవాలి? ఎటువంటి నడవడికను అలవరచుకోవాలి? ఏ పద్ధతులు పాటించాలి? ఏవి పాటించకూడదు? ఆచార వ్యవహారాలు, మరెన్నో విధివిధానాలు, అనుబంధ బాంధవ్యాలు, కట్టు బొట్టు, మంచి, చెడు వంటి అనేకానేక విలువైన విషయాలు కనుమరుగు కాకూడదని, తరతరాల వారు గుర్తించి ఆచరించి తమ మనుగడని సులభతరం చేసుకొనే విధంగా ఇటువంటి విషయాలనెన్నిటినో భాషాపరంగా నిక్షిప్తం చేశారు మన పూర్వీకులు.

"సర్వేంద్రియాణాం నయనం ప్రధానం", "ఆరోగ్యమే మహాభాగ్యం", "బాలానాం రోదనం బలం", "విద్యాధనం సర్వధన ప్రధానం", "కృషితో నాస్తి దుర్భిక్షం", "ధనమూలమిదం జగత్, .... ఇలా ఎన్నెన్నో చాలా సులభార్థముతో కూడుకొన్నవై, పండిత పామర భేదం లేకుండా చిరకాలం నిలిచిపోయేవెన్నో విషయాలు తెలియజెప్పారు.

నిజానికి " సర్వేంద్రియాణాం నయనం ప్రధానం" అని ఆ ఒక్క వాక్యం ప్రచారంలోనికి వచ్చినా, కంటితో బాటు మరికొన్ని విషయాలు కూడా ప్రధానమని ఉపమానాలంకారంలో వర్ణిస్తూ శాస్త్రకారులు ఏకంగా ఓ శ్లోకమే చెప్పారు.

సర్వస్య గాత్రస్య శిరః ప్రధానం<br>
సర్వేంద్రియాణాం నయనం ప్రధానం<br>
షణ్ణాం రసానాం లవణం ప్రధానం<br>
భవేన్నదీనముదకం ప్రధానం

అంటే శరీరమంతటికీ శిరస్సు, పంచేంద్రియాలలో కన్ను, ఆరు రుచులలో ఉప్పూ, అన్ని నదులలోనూ నీరే ప్రధానమని అర్థం. అలాగే "ధన మూలమిదం జగత్" కూడ ఆ ఒక్క వాక్యంతో ఆగిపోలేదు.

వేదమూలమిదం బ్రాహ్మ్యం<br>
భార్యామూలమిదం గృహం<br>
కృషిమూలమిదం ధాన్యం<br>
ధన మూలమిదం జగత్.

ఇదీ అసలు పద్యం. అంటే బ్రాహ్మణత్వానికి వేదాలు, ఇంటికి ఇల్లాలు, పాడిపంటలకి (ధాన్యానికి) కృషి, లోక వ్యవహారాలన్నిటికీ ధనము చాలా ముఖ్యమని అర్థం. అలాగే కృషితో నాస్తి దుర్భిక్షం కూడా..

కృషితో నాస్తి దుర్భిక్షం<br>
జపతో నాస్తి పాతకం<br>
మౌనేన కలహో నాస్తి<br>
నాస్తి జాగరతో భయం

అంటే కష్టపడుట వలన కరువు కాటకాలు, జపతపాల వలన పాపాలు, మౌనం వహించటం వలన కలహాలు, జాగరూకతతో వుండడం వలన భయాలు ఉండవని భావము. అలాగే "మాట వాన వచ్చు మన్నన ధరలోన, మాట వలన వచ్చు పోటు గూడ.." అన్నాడో మహానుభావుడు. మనం మాట్లాడే మాటలే మనకి మిత్రులని, శత్రువులని కూడా తెచ్చిపెడతాయి. అందుకే ఎప్పటికీ మంచి మాటలాడడమే శ్రేయస్కరమని చెబుతూ..

జిహ్వాగ్రే వర్తతే లక్ష్మీ
జిహ్వాగ్రే మిత్ర బాంధవాః
జిహ్వాగ్రే బంధనప్రాప్తి
జిహ్వాగ్రే మరణం ధ్రువం

అన్నారు. లక్ష్మీ దేవి నాల్క పైనే ఉంటుందని, బంధు మిత్ర ప్రాప్తి కూడా జిహ్వాగ్రమునందే యుండునని, బంధాలు, అనుబంధాలు నాల్క చివరనే యున్నవని, చివరికి మన మరణం కూడ నాల్క కొసలనే యుండునని భావం. దీనికంతటికీ ముఖ్యోద్దేశ్యం మంచి మాటలాడిన మంచి కలుగునని, తెలిసి తెలిసీ చెడుగా మాటలాడరాదనీను. అలాగే మన పెద్ద వాళ్ళు తినే దగ్గర సిగ్గు పడరాదని అంటూ వుంటారు. అది అతి మామూలుగా చెప్పే విషయమైనప్పటికీ సిగ్గుపడరాని విషయాలనన్నిటినీ గుది గుచ్చి,

గీతే వాద్యే, తథా నృత్యే,
సంగ్రామే, రిపు సంకటే,
ఆహారే, వ్యవహారేచ,
త్యక్త లజ్జః సుఖీ భవేత్.

అంటే లలిత కళలలో ప్రసిద్ధమైన గాన, వాద్య, నృత్యాలలో, యుద్ధభూమిలో, శత్రువులతో చిక్కులు కలిగినప్పుడు, భోజనం చేసేటప్పుడు, వ్యాపార వ్యవహారాలు చూసేటప్పుడు, సిగ్గును విసర్జించిన వారికే సుఖము, జయము కలుగుతాయని అర్థం. పెద్ద వారికి ఆహార పానీయాలే బల వర్ధకాలయితే, పిల్లలకు మాత్రం "బాలానాం రోదనం బలం.." అన్నారిలా ..

పక్షీణాం బలమాకాశం
మత్స్యానాముదకం బలం
దుర్బలస్య బలం రాజా
బాలానాం రోదనం బలం..

పక్షులు ఎగిరేందుకు ఆకాశమే బలమని, చేపలు ఈదేందుకు నీళ్ళే బలమని, దుర్బలులకు రాజే బలమని, పిల్లలకు ఏడుపే బలమని అర్థం. అంతే కాకుండా మనమనుభవించే సుఖదుఃఖాలు, భోగభాగ్యాలు, మనం చేసే కర్మలను బట్టి, నేర్చుకొనే విద్యాబుద్ధులని బట్టి వుంటాయని కూడా చెప్పారు.

అభ్యాసానుసరీ విద్యా
బుద్ధిః కర్మానుసారిణీ
ఉద్యోగానుసరీ లక్ష్మీః
ఫలం భాగ్యానుసారిణీ

అంటే మనం నేర్చుకొనే విద్య అభ్యాసము వలన అధికమగునని, బుద్ధి మనం చేసే కర్మలననుసరించి వుండునని, ధనము మనం చేసే వృత్తిననుసరించి వుంటుందని, వీటన్నిటి ఫలము మాత్రం మన అదృష్టాననుసరించి వుంటుందని అర్థం. ఎవరికైనా అదృష్టం ఒక్కసారే తలుపు తడుతుందని, దురదృష్టం మాత్రం తలుపు తెరచే వరకూ తడుతూనే వుంటుందని మన పెద్దలంటూంటారిందుకే కాబోలు. అలాగే మనం ఎవరైనా ఇంటికి వృద్ధులను గాని, చిన్న పిల్లలను గాని, జబ్బు చేసిన వారిని గాని చూడటానికి వెళ్ళినప్పుడు వుత్త చేతులతో వెళ్ళరాదని నియమం. అది అలవాటుగా వాడుకలోకి వచ్చినా, దానిని కూడా శాస్త్రబద్ధంగా ఇలా చెప్పారు.

అగ్నిహోత్రం, గృహం, క్షేత్రం,
గర్భిణీం వృద్ధ బాలకా
రిక్త హస్తేన నోపేయా
రాజానామ్ దైవతం గురుం..

అంటే అగ్నిహోత్రము అనగా యజ్ఞ యాగాదులు మొదలైనవి, ఎవరి ఇళ్ళకు గానీ, పుణ్యక్షేత్రాలు, ఆలయాలు దర్శించినప్పుడు గానీ, గర్భిణీ స్త్రీలను, ముసలి వారిని, పిల్లలను, రాజును, గురువును చూచుటకు వెళ్ళినప్పుడు గాని వట్టి చేతులతో పోరాదని, కనీసం పూలు, పండ్లు వంటివైనా తీసుకెళ్ళాలని భావం.

ఈనాటికీ ప్రతి చిన్న శుభాశుభ కార్యాలకి ముహూర్తాలకోసం బ్రాహ్మణులను సంప్రదిస్తూ ఉంటాము. వారేది చెప్పినా వేదంలా పాటిస్తూ, వారే ప్రత్యక్ష దైవమని, దైవాంశ సంభూతులని భావిస్తూ ఉంటాము. అలాంటి దైవత్వం వారికి వూరికే రాలేదు. సాక్షాత్తు భగవంతుడంతటి వాడు కూడ బ్రాహ్మణుని దైవంగా భావించాడుట, ఎందుకంటే,

దైవాధీనం జగత్సర్వం
మంత్రాధీనం తు దైవతం
తన్మంత్రం బ్రాహ్మణాధీనం
బ్రాహ్మణో మమ దైవతం. .

ఈ జగత్తు అంతా భగవంతుని అధీనంలో వుంటే, అలాంటి భగవంతుడు మంత్రాలకి కట్టుబడి వుంటాడట. ఆ మంత్రాలు బ్రాహణుని ఆధీనంలో ఉండుటచే, బ్రాహ్మణుడే దైవమని సాక్షాత్తూ ఆ భగవంతుడే అన్నాడట. దేవుడు వరమిచ్చినా, పూజారి వరమీయందే ఏ పనీ జరగదని కూడా అంటూంటారు. ఒక్క ఆంధ్ర దేశంలోనే కాక, ఇతర దేశాలలో కూడా బ్రాహ్మణునిపై ఆధారపడి వున్న మనవంటి ప్రవాసాంధ్రులు కూడ ఇది నిజమని నమ్మక తప్పదు.

దాతృత్వం, ప్రియ వక్తృతంవ్
ధీరత్వముచిత లజ్ఞతా
అభ్యాసేన నలభ్యంతే
చత్వారః సహజ గుణాః

దాన గుణాం, మంచిగా మాటాడడం, ధైర్యము, సమయాసమయముల ఇచక్షణా జ్ఞానము అను ఈ నాలుగు సహజ గుణాలు. జన్మతః పుట్టుకతోనే రావాలి గాని, ఒకరిని చూసి నేర్చుకొనేవి కావని పెద్దలు చెప్పారు. అందుకే కదా పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకలతో కాని పోవని అంటూ ఉంటారు. అలాంటి బుద్ధులు మంచివైతే మనిషి సర్వత్రా పూజింప బడతాడు. కాకపోతే తన వరవ పరిమితమై మూర్ఖునిగా పరిగణింపబడతాదు.

స్వగృహే పూజ్యతే మూర్ఖః
స్వగ్రామే పూజ్యతే ప్రభుః
స్వదేశే పూజతే రాజా
విద్వాన్సర్వత్ర పూజ్యతే. .

మూర్ఖుడు తన ఇంటిలోను, ప్రభువు తన గ్రామంలోనూ, రాజు తన దేశంలోనూ మాత్రమే పూజింప బడతారు కానీ విద్వాంసుడు, ఎల్లెడలా పూజింపబడతాడని అర్థం. ఈ విద్యల వలననే కదా, ఈనాడు ప్రపంచమంతా ఒక వసుధైక కుటుంబంలా వర్ధిల్లుతోంది.

విద్య ఏదైనా సరే, తల్లి మొదటి గురువు, దైవం, మన పురాణేతిహాసాలు కూడా తల్లే ప్రత్యక్ష దైవమని చెప్పాయి. అలాంటి తల్లిని పూజించి గౌరవించటం మన ప్రప్రథమ కర్తవ్యం. అది ఎంతటి పుణ్యమో చెబుతూ. .

భూప్రదక్షిణ షట్కేన,
కాశీ యాత్రా యుతేన చ
సేతుస్నాన శతైర్యశ్చ
తత్ఫలం మాతృ వందనే. .

ఆరుసార్లు భూప్రదక్షిణములు చేసిననూ, పదివేలసార్లు కాశీ యాత్ర చేసిననూ, అనేకానేకమార్లు సముద్ర స్నానము చేసినను కలుగునంతటి పుణ్యం ఒక్క మాతృ వందనంతో లభిస్తుందని అర్థం. అంత పుణ్యం తలికి ప్రేమతో, భక్తితో నమస్కరించి సేవిస్తే కలుగుతుందట.

ఈ చిన్న మాట మనం ప్రత్యక్షముగా ఆచరించి, మన పిల్లలకి అందించి నేరిపించ గలిగితే రాసిన వారికీ, ఆచరించిన మనకు జన్మ ధన్యమైనట్లే కదా. మనమెంతటి ఉన్నత విద్యావంతులమైనా, ఒక్కొక్కసారి మన అదృష్టాన్నే నమ్ముకోవాలసి వస్తుందని, మన చేతిలో ఫలితాలనీ ఉండవనేది అక్షర సత్యం. ఎందుకంటే,

సముద్ర మథనే లాభే
హరిర్లక్ష్మీం, హరోర్విషం,
భాగ్యం ఫలతి సర్వత్ర
న విద్యా నచ పౌరుషం. .

అమృతం కొరకు పాల సంద్రాన్ని మధిస్తే, శ్రీమహావిష్ణువుకు లక్ష్మీ దేవి, సదాశివునికి విషమూ దొరికాయట. కాబట్టి, ఎవరికి ఏది లభించాలో అది వారి వారి కర్మ ఫలానుసారమైన అదృష్టమే కానీ, విద్యా విశేషాలు, పౌరుషాలు ప్రదర్శించటం వల్ల మాత్రమే ఒరగదట. ఇది ఎవరూ కాదనలేని జీవిత సత్యం. అంతే కాదు, సంపదలు శాశ్వతం కాదని, ఎలా వస్తాయో, ఎలా పోతాయో ఎవరూ చెప్పలేరని కూడా తెలిపారు పెద్దలు.

ఆజగామ యదా లక్ష్మీ
నారికేళా ఫలాం భువత్
నిర్జగామ యదా లక్ష్మీ
గజ భుక్త కపిత్థవత్.

సంపద వచ్చినప్పుడు కొబ్బరికాయలోకి నీరు వచ్చినట్లు కనపడకుండా వచ్చి చేరుతుందట, అలాగే పోయినప్పుడు కరిమ్రింగిన వెలగపండులా కనపడకుండా పోతుందట. ఇటువంటి అస్థిరమైన సంపదను పొందటం కంటే, స్థిరమైన కీర్తి ప్రతిష్ఠలు పొందడమే మేలని చెప్పారు.

అస్థిరం జీవనం లోకే
అస్థిరం యౌవనం, ధనం,
అస్థిరం దార పుత్రాది
ధర్మః కీర్తి ద్వయం స్థిరం. .

జీవితం, యౌవనం, ధనం, భార్యా బిడ్డలూ ఇవేవీ శాశ్వతం కావని, ఒక్క కీర్తి ప్రతిష్ఠలు, దయాధర్మాలే శాశ్వతమని అర్థం. ఇలాంటి సుస్థిరమైన జీవితం సాగించాలన్నా, శాశ్వతకీర్తి సంపాదించాలన్నా, మనిషికి చింత అనేది ఉండకూడదు. ఎక్కడ చింత ఉంటుందో అక్కడే అశాంతి మొదలై మన జీవితాల్ని దహించి వేస్తుంది.

చితా చింతా ద్వయోర్మధ్యే
చింతా నామ గరీయసీ
చితా దహతి నిర్జీవం
చింతా ప్రాణయుతం వపుః

చితి అంటే నిర్జీవాన్ని కాల్చేది, చింత అంటే విచారము, దేనికోసమో వెంపర్లాట. చితి, చింతలలో చింతయే గొప్పదట, ఎందుకంటే చితి ప్రాణం లేని దేహాన్ని మాత్రమే కాల్చ గలదు కానీ చింత బ్రతికి వుండగానే దహించి వేస్తుందిట. నిరంతరం దేనికోసమో చింతించే వారికి సుఖం లేదని ఎంతచక్కగా చెప్పారో కదా.

ఇవన్నీ నిజంగా తరతరాలకి పనికివచ్చే అక్షర సత్యాలు. కాలక్రమేణా వాటి యదార్థ రూపాలు మారుతున్నా, వాటి విలువ మాత్రం అనంతం. ఇలాంటివే కాదు, ఇంకా ఎంతో చిన్న చిన్న పదాలతో, ఎన్నెన్నో గొప్ప జీవితార్థాలు, మరెన్నో ఆరోగ్యానందసూత్రాలు కూడా చెప్పారు.

ఆటపాటల చిన్ననాటనే, "కాళ్ళా గజ్జా, కంకాళమ్మా, వేగుచుక్కా, వెలగపండూ" అన్నా, "చెమ్మ చెక్కా, చారెడేసి మొగ్గా" అని ఆడినా, "చిట్టి పొట్టి మిర్యాలు, అట్లతద్ది ఆరట్లు-ముద్ద పప్పూ మూడట్లు" అని పాడినా వాటిలో ఎన్నో ఆరోగ్యసూత్రాలు దాగి వునాయి. అలాగే ఋతు, ఋతువుకూ రుచులు మార్చుతూ వచ్చే మన పండుగలు, పద్ధతుల పరమార్థం కూడా ఆయురారోగ్యైశ్వర్యానందాలను పెంపొందించటమే.

తరాలు మారినా, అంతరాలు మారినా, మనిషి మనుగడకు మార్గ నిర్దేశం చేసే ఈ నీతి సూత్రాలు చిరకాలం వర్ధిల్లుతూనే వుంటాయి. ఇవన్నీ పట్టుకొని, పాటించి, పాకులాడేవారికే అన్ని పద్ధతులూ. అలా కాక ఏటికెదురీదితే, నష్టపోయేది మనిషే అని అనుభవజ్ఞుల ఉవాచ.

ఈనాడు ఇది మోదము సరి
మరునాడు మరొకటని మరి మరి
మార్చి మార్చి తిరుగువారికి
సుఖమెన్ని జన్మలకైన సున్న హరీ!

అంతే కదా మరి. అలా కాక, అన్ని సూత్రాలు, శాస్త్రాలు మానవాళి మంచి మనుగడ కొరకే అని అనుకొని, అంతో, ఇంతో, ఏ కొంతోసైనా పాటించే వారికి అలదేవేంద్రుడేని పరాభవమొనర్పనేరడు ఒకింతన్.

*ఎందరో మహానుభావులు! అందరికీ శతకోటి వందనములు!!*

# పలివెల శ్రీ ఉమా కొప్పు లింగేశ్వర స్వామి క్షేత్ర గాథ

-

భారత దేశం కర్మ భూమి. ఎన్నో పుణ్య క్షేత్రాలకి పుట్టినిల్లు. కాశీ, ప్రయాగ, హృషీకేష్ హరిద్వార్ పూరి జగన్నథ్ తిరుపతి, కంచి ఇలా ఎన్నో, ఎన్నెన్నో పేరు గాంచిన, మహిమ గల పుణ్యక్షేత్రాలే కాకుండా, ఇంకా ఎన్నో పుణ్యక్షేత్రాలు పలు గ్రామాల్లో వెలసి, ఎంతో జనాదరణని పొంది, మహిమా స్వరూపాలుగా పేరుగాంచాయి. అటువంటి పుణ్యక్షేత్రాలలో, ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా, అమలాపురం వెళ్ళుదారి మధ్యలో కొత్తపేట తాలూకాలో "పల్వల పురం" గ్రామం లోని శైవ క్షేత్రం ఎంతో ప్రసిద్ధి గాంచింది. ఇక్కడి మూల విరాట్టు పరమ శివుడు. జటాఝూటధారియై, కొప్పులింగేశ్వరస్వామిగా ఆ చుట్టు ప్రక్కల ప్రాంతాలలో ఎంతో పేరుగాంచింది. ఈ క్షేత్ర దేవాలయం చూడటానికి ఎంతో నయనానందకరంగా చుట్టూ పచ్చటి పంట పొలాలు, కొబ్బరి తోటలతో, పిల్ల కాలువలతో ఎంతో ప్రశాంతంగా పలువురిని ఆకర్షిస్తూ ఉంటుంది.



ఇక్కడ పరమశివుడు కొప్పు లింగేశ్వర స్వామిగా వెలిసి వుండడానికో పూర్వ చరిత్ర ఉన్నది. పూర్వము అగస్త్య మహాముని కౌశికా నదీతీరమున గల ఈ పల్వల పుర దివ్యక్షేత్రమున కళ్యాణ పీఠముపైనున్న పార్వతీ పరమేశ్వరులను ప్రతిష్ఠించెను. నాటి నుండీ ఇది అగస్త్యేస్వర క్షేత్రమని ప్రసిద్ధి గాంచెను. ఇట్లుండ, ఈ అగస్త్యేస్వరుని, వెలనాటి వంశమునకు చెందిన యొక విప్రుడు నిష్ఠాగరిష్టుడై విశేష భక్తితో పూజించుచుండెను. పౌరులాతని వేశ్యాలోలతను సహింపజాలక, రాజ్యపాలకునికి ఫిర్యాదు చేసిరి. మహారాజా ఫిర్యాదులను వినియు నిర్లక్ష్యము చేసెను. కాని నానాటికి ఫిర్యాదులు హెచ్చుచుండుటచే ఒకానొక రోజున ఆకస్మికంగా పూజారిని పరీక్షింపనెంచి మహారాజు పల్వలపురమునకు వచ్చెను.

